teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 162 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 9 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ‘ 5


Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఐసీసీకి భారీ షాక్

T20 వరల్డ్ కప్ నుంచి తప్పుకున్న జియో హాట్‌స్టార్

ప్రసారకర్తగా కొనసాగలేమని రిలయన్స్-డిజ్నీ నిర్ణయం




07



## తెలంగాణలో రహదారుల విప్లవం

రాష్ట్రవ్యాప్తంగా 4 లేన్ల రోడ్లు

అమరావతి, బెంగళూరు, చెన్నైలకు గ్రీన్ ఫీల్డ్ హైవేలు

బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

గ్లోబల్ సమ్మిట్ వేదికగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య ప్రకటన

.. వివరాలు 2లో




## 2026 సెలవుల క్యాలెండర్ విడుదల

సాధారణ మరియు ఐచ్ఛిక సెలవుల ప్రకటన

.. వివరాలు 2లో




# ఇండిగోకు గట్టి వార్నింగ్

## పైలట్ల కొరత వాస్తవమే

- ఇండిగోకు విధించే శిక్ష ఉదాహరణగా నిలుస్తుంది
- హైకోర్టు ఆదేశాలతో కొత్త నిబంధనలు
- నిర్వహణా లోపమే ఇండిగో సంక్షభానికి కారణం
- భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా చర్యలు
- మరిన్ని ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించే యత్నం
- పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు

ఇండిగో సంక్షోభంపై రాజ్యసభలో సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. నెల రోజుల నుంచి ఈ వ్యవహారంపై దృష్టి పెట్టామని, పైలట్లు, సిబ్బంది కొరత కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనన్నారు. ఇలాంటి సమస్యలు భవిష్యత్ లో రిపీట్ చేయరాదని ఇండిగో సంస్థకు గట్టి వార్నింగ్ ఇచ్చామని చెప్పారు.

02



### తొలి దశ పంచాయతీ పోరుకు

# సర్వం సిద్ధం

## మూడు రోజుల పాటు మద్యం బంద్

డిసెంబర్ 11న 4,236 పంచాయతీలకు ఎన్నికలు




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 11న జరిగే తొలి విడతలో 4,236 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఇంకా మూడ్రోజులే

మిగతా 2 లో

## మియాపూర్‌లో హైడ్రా సంచలనం

- రూ. 600 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం
- ముక్తామహబూబ్ కుంటలో 5 ఎకరాల ఆక్రమణ
- నకిలీ సర్వే నెంబర్లతో దందా
- బడా బాబుల హస్తంపై అనుమానాలు

02







## ఎర్రకోట పేలుళ్ల కేసులో కీలక పరిణామం

నిందితుల ఎన్ఐఏ కస్టడీ పొడిగింపు

4 రోజుల పాటు విచారణకు ఢిల్లీ కోర్టు అనుమతి

వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ గుట్టురట్టు

ఇప్పటివరకు ఏడుగురు అరెస్ట్

కీలక ఆధారాల కోసం ఎన్ఐఏ వేట

దేశవ్యాప్తంగా ముమ్మర సోదాలు

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): నవంబర్ 10న జరిగిన ఎర్రకోట పేలుళ్ల కేసులో అరెస్టయిన ముగ్గురు వైద్యులు మరియు ఒక మత ప్రచారకుడి ఎన్ఐఏ కస్టడీని ఢిల్లీ కోర్టు సోమవారం మరో నాలుగు

మిగతా 2 లో

## రేవంత్‌రెడ్డి బిల్డప్ బాబాయ్

“అంతా అబద్ధమే”

- ప్రజాభవన్ జల్సాలకు కేరాఫ్
- కాంగ్రెస్‌ది ప్రైవేట్ లిమిటెడ్ పాలన
- బిల్లులకు 30% కమిషన్ ఇవ్వాల్సిందే
- సీఎంపై హరీష్ రావు సెటైర్లు



హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్. ఏం మాట్లాడినా అబద్ధమే అంటూ విరుచుకుపడ్డారు. ఇదే సమయంలో జల్సాలకు, విందులు, వినోదాలకు

మిగతా 2 లో




## తెలంగాణ రైజింగ్ అట్టహాసంగా ప్రారంభం

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీయే లక్ష్యం
- చైనా గ్వాంగ్‌డాంగ్ స్ఫూర్తితో అభివృద్ధి
- మూడు రంగాలుగా త్రిముఖ వ్యూహం
- తెలంగాణలో అపార అవకాశాలు
- పెట్టుబడిదారులకు సీఎం రేవంత్ పిలుపు

02

## ఫ్యూచర్ సిటీకి అన్నపూర్ణ స్టూడియోస్

తెలంగాణ విజన్ అద్భుతం: నాగార్జున

గ్లోబల్ సమ్మిట్‌లో సందడి

సర్కార్ విజన్ డాక్యుమెంట్‌పై ప్రశంసలు



.. వివరాలు 2లో

## గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చేదంతా దోచుకునేవాళ్లే

సీఎం రేవంత్‌పై కేఏ పాల్ ఫైర్

రేవంత్ రెడ్డి తక్షణం రాజీనామా చేయాలి



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు క్టేఏ పాల్

మిగతా 2 లో



## 32 లక్షల మందికి వంద పడకల ఆసుపత్రి లేదు

- జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులదే రాజ్యం
- చిన్న సర్జరీకైనా గాంధీకే రిఫర్.. గర్భిణీలకు నరకయాతన
- మల్కాజ్‌గిరిపై కవిత ఆగ్రహం

మేడ్చల్ మల్కాజ్ గిరి, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): 32 లక్షల మంది ఉన్న మల్కాజిగిరిలో ఒక్క వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ పక్కనే ఉన్న మల్కాజ్ గిరి జిల్లాలో 32 లక్షల మంది ఉన్నారని

మిగతా 2 లో

## ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

- క్యాట్ ఉత్తర్వులపై స్టే
- తెలంగాణ కేటాయింపును నిలిపివేస్తూ ఉత్తర్వులు
- రిజర్వ్ కేటగిరీతో ‘స్వాపింగ్’ చెల్లదని డిఓపీటీ వాదన

02



# ఇండిగోకు గట్టి వార్నింగ్




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఇండిగో సంక్షోభంపై రాజ్యసభలో సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. నెల రోజుల నుంచి ఈ వ్యవహారంపై దృష్టి పెట్టామని, పైలట్లు, సిబ్బంది కొరత కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనన్నారు. ఇలాంటి సమస్యలు భవిష్యత్ లో రిపీట్ చేయరాదని ఇండిగో సంస్థకు గట్టి వార్నింగ్ ఇచ్చామని చెప్పారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగినందుకు క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 కొన్ని కొత్త నియామాలను అమలు చేస్తామని ఇండిగో ఎయిర్ లైన్స్ సంస్థ వెల్లడించిందని చెప్పారు.

దేశంలో మరికొన్ని ఎయిర్ లైన్స్ అవసరం ఉందన్నారు. హైకోర్టు ఆదేశాలతో నియమాలను రూపొందించినట్లు చెప్పారు. ఇండిగో సంక్షోభంపై విచారణ జరుగుతోందని భవిష్యత్‌లో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించే ఎయిర్ లైన్స్ సంస్థలకు తామిప్పుడు ఇండిగోకు విధించబోయే శిక్ష ఓ ఉదాహరణగా ఉండబోతోందన్నారు. అయితే రామ్మోహన్ నాయుడు సమాధానంపై విపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు



హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు ధర్మాసనం తాజాగా స్టే విధించింది. క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఆమ్రపాలి తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ఈ క్రమంలో తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. అయితే, ఐఏఎస్ ఆమ్రపాలిని ఏపీకి అలాట్ చేస్తూ గత ఏడాది అక్టోబర్‌లో డిఓపీటీ ఉత్తర్వులు జారీ చేశారు. డిఓపీటీ ఉత్తర్వులను ఆమ్రపాలి క్యాట్‌లో సవాల్ చేశారు. ఈ క్రమంలో ఐఏఎస్ హరికిరణ్‌తో స్వాపింగ్‌లో భాగంగా ఆమ్రపాలిని క్యాట్ తెలంగాణకు కేటాయించింది. ఈ క్రమంలో క్యాట్ ఉత్తర్వులను డిఓపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ సందర్భంగా ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదు అని వాదించింది. హరికిరణ్ రిజర్వ్ కేటగిరీ కాబట్టి ఆయనతో ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదు అని తెలిపింది. ఈ క్రమంలో తాజాగా క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలి న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. అప్పటి వరకు క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్టు హైకోర్టు తీర్పు ఇచ్చింది.

## రేవంత్‌రెడ్డి బిల్డప్ బాబాయ్

మొదటి పేజీ తరువాయి

ప్రజాభవన్‌ను కేరాఫ్‌గా మార్చారు అంటూ ఘాటు విమర్శలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రేవంత్ పాలనలో రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత లేదు. ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ రెండేళ్లలో చేసిందేమీ లేదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారు. రెండేళ్ల పాలనలో రాష్ట్ర ఆదాయం ఎందుకు తగ్గింది?. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. అలాగే, ప్రతీరోజు ప్రజల్ని కలుస్తానని రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పారు. ప్రమాణ స్వీకారం చేసిన ఒక్కరోజు మాత్రమే ప్రజాభవన్‌కు రేవంత్ వచ్చారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్. ఏం మాట్లాడినా అబద్ధమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. పెళ్లిళ్లకు, సీఎల్పీ మీటింగ్‌లకు ప్రజాభవన్‌ను వాడుతున్నారు. రేవంత్ రెడ్డిది ప్రైవేట్ లిమిటెడ్ పాలన రెండేళ్ల పాలనలో రేవంత్ చేసింది ఒక్కటైనా చెప్పగలడా?. అవినీతి ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలి. ఫైనాన్స్‌లో బిల్లు రావాలి అంటే 30 శాతం ఇవ్వాలి. భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్, ఉత్తమ్, ఆర్ఆర్ ట్యాక్స్ తీసుకువచ్చారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలి అని కామెంట్స్ చేశారు.

## 32 లక్షల మందికి వంద పడకల ఆసుపత్రి లేదు

మొదటి పేజీ తరువాయి



కానీ ఒక్క ఆస్పత్రి కూడా లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు రాజ్యం ఏలుతున్నాయని అన్నారు. ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, కొన్ని సబ్ సెంటర్లు ఉన్నాయని అన్నారు. కానీ వందపడకల ఆస్పత్రి ఒక్కటి కూడా లేదని అన్నారు. దీంతో ప్రజలంతా ప్రైవేటుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. సర్జరీలు అయితే గాంధీ ఆస్పత్రికి పంపిస్తున్నారని చెప్పారు. జవహర్ నగర్, కేబీహెచ్ బీ ప్రాంతాల నుండి గాంధీకి రిఫర్ చేస్తున్నారని మండిపడ్డారు. కీసర లోనూ అదే పరిస్థితి కనిపిస్తుందని విమర్శించారు. గర్భిణీలు చాలా దూరం నుండి వచ్చేవారు గంట, రెండు గంటలు ప్రయాణం చేయాలంటే ప్రాణం పోయే పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. మేడ్చల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజలు ఎక్కువగా ఉన్నారని కానీ ఆస్పత్రి లేదన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఓ ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 2026 సెలవుల క్యాలెండర్ విడుదల




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించిన సెలవుల వివరాలు విడుదల చేసింది. వచ్చే ఏడాది (2026)కి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశాల మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2026 సంవత్సరంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు అధికారిక ఉత్తర్వులలో పేర్కొన్న మొత్తం 27 సాధారణ సెలవు దినాలలో మూసివేయబడతాయి. దీంతో పాటు ప్రతి నెలలోని ఆదివారాలు, రెండవ శనివారాలు యథావిధిగా సెలవు దినాలుగా కొనసాగుతాయి.

2026లో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవులు.

సంక్రాంతి (జనవరి 15)
గణతంత్ర దినోత్సవం (జనవరి 26)
హెూలీ (మార్చి 3)
ఉగాది (మార్చి 19)
ఈదుల్ ఫితర్/రంజాన్ (మార్చి 21)
శ్రీ రామ నవమి (మార్చి 27)
డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14)
ఈదుల్ అజహా/బక్రీద్ (మే 27)
బోనాలు (ఆగస్టు 10)
స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15)
వినాయక చవితి (సెప్టెంబర్ 14)
విజయ దశమి/దసరా (అక్టోబర్ 20)
దీపావళి (నవంబర్ 8)

క్రిస్మస్ (డిసెంబర్ 25).

ఐచ్ఛిక సెలవులు:
న్యూ ఇయర్ డే (జనవరి 1)
కనుమ (జనవరి 16)
శ్రీ పంచమి (జనవరి 23)
మహావీర్ జయంతి (మార్చి 31)
బుద్ధ పౌర్ణమి (మే 1)
నరక చతుర్దశి (నవంబర్ 8)
క్రిస్మస్ ఈవ్ (డిసెంబర్ 24).


## తెలంగాణ రైజింగ్ అట్టహాసంగా ప్రారంభం



హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రైజింగ్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్లోబల్ సమ్మిట్ వైభవోపేతంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రముఖ సినీనటుడు నాగార్జున, వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మాహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆదర్శంగా తమ అభివృద్ధి మార్గాన్ని రూపొందించుకుంటున్నామని, దేశంలోనే యంగెస్ట్ రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. వచ్చే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 100 ఏళ్లు అవుతాయని, ఆ సమయానికి మనమేం సాధించగలమో చెప్పాలని నిపుణులను కోరామని ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడిందని తెలిపారు. ఆ తర్వాత అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకుని విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, వారందరికీ ధన్యవాదాలని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ అని వెల్లడించారు.

### అపారమైన అవకాశాలు.

గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం అదృష్టంగా భావిస్తున్నామని, వ్యాపార వేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులు, నిపుణులకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మీ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, మంచి సానుకూల వాతావరణం ఉందన్నారు. 2034



నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని తెలిపారు. దేశంలో తెలంగాణ దాదాపు 2.9 శాతం జనాభా కలిగి ఉందని దేశ జీడీపీలో ఇక్కడి నుంచి దాదాపు 5 శాతం వాటాను అందిస్తున్నామన్నారు. 2047 నాటికి 10 శాతం వాటాను అందించాలన్నది తమ లక్ష్యమని చెప్పారు.

### త్రిముఖ వ్యూహం.

సమగ్ర తెలంగాణ అభివృద్ధి కోసం సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం ఇలా 3 భాగాలుగా విభజించి ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని సీఎం తెలిపారు. ఇందుకోసం అర్బన్ రీజియన్ ఎకానమీ పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ మోడల్స్ తీసుకొచ్చామన్నారు. ఈ సందర్భంగా చైనాలోని గ్వాంగ్-డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి సీఎం ప్రస్తావించారు. గ్వాంగ్‌డాంగ్ ఆర్థిక వ్యవస్థ చైనాలోని ఏ ప్రావిన్స్‌కైనా అతిపెద్దదని 20 ఏళ్లలో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులను, వృద్ధి రేటును సాధించారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా తాము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నట్టు చెప్పారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి తామెంతో ప్రేరణ పొందామన్నారు. ఆ దేశాలతో పోటీ పడాలనుకుంటున్నామని, తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో సహకరించడానికి, పెట్టుబడి పెట్టడానికి, సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆకాంక్షిస్తూ మీ అందరినీ ఆహ్వానించామన్నారు. విజన్ కష్టంగా అనిపించినా సాధించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని, మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా నమ్ముతున్నానని సీఎం పేర్కొన్నారు.

## తొలి దశ పంచాయతీ పోరుకు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

టైమ్ ఉండటంలో ఎన్నికల సంఘం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ వరకు వైన్స్, బార్లు, రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా తొలి విడత ఎన్నికలు ఈ నెల 11న 4,236 స్థానాల్లో జరగనున్నాయి.

## మియాపూర్‌లో హైడ్రా సంచలనం

హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మహానగరంలోని మియాపూర్‌లో భారీ స్థాయి భూకబ్జాలను అడ్డుకుని ప్రభుత్వ ఆస్తిని కాపాడింది హైడ్రా. సుమారు రూ.600 కోట్ల విలువ గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి పూర్తిగా స్వాధీనం చేసింది. ఈ కబ్జాలు మియాపూర్ ముక్తామహబూబ్ కుంటకు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 44/5లోని కుంట భూభాగంలో ఈ కబ్జా చేసుకుంది. కబ్జా చేయడానికి కబ్జాదారులు దానిని 44/4 సర్వే నెంబర్‌గా చూపించి అక్రమ మార్పులు చేసినట్లు హైడ్రా దర్యాప్తులో బయటపడింది. కుంట కట్టపై దాదాపు 200 మీటర్ల మేర 18 షెడ్లను ఏర్పాటు చేసి నెలకు 50 వేల చొప్పున అద్దె వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. అదేకాకుండా ఖాళీ స్థలాన్ని ప్రైవేట్ బస్సు పార్కింగ్ కోసం ఉపయోగించి నెలకు 8 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు హైడ్రా అధికారుల దర్యాప్తులో బయటపడింది. కబ్జాదారుల వద్ద భూమికి సంబంధించిన ఏ పత్రాలు లేవని నిర్ధారించడంతో హైడ్రా క్షణమే చర్యలకు దిగింది. అక్రమంగా నిర్మించిన అన్ని షెడ్లను తొలగించి, భూభాగం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని రక్షించింది. కూన సత్యం గౌడ్, బందారి అశోక్ ముదిరాజ్ ఈ కబ్జాలకు ప్రధాన కారకులు అని హైడ్రా గుర్తించింది. వీరి వెనుక కొన్ని బడా బాబుల మద్దతు ఉన్నట్టు కూడా అధికారులు అనుమానిస్తున్నారు.

## తెలంగాణలో రహదారుల విప్లవం



హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రపంచమంతా గ్లోబల్ సమ్మిట్ వైపు ఆసక్తిగా చూస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులందరం యూనిటీగా పని చేస్తున్నాం. 2034 వరకు 1ట్రిలియన్ ఎకానమీ, 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, కొత్త ఎయిర్పోర్టులు, డ్రైపోర్ట్ నుండి కోస్టల్ ఏరియా కనెక్టివిటీ, సౌత్ ఇండియా స్టేట్స్ కనెక్టివిటీ కారిడార్, గ్రీన్ ఫీల్డ్ హైవేలు లాంటి ప్రణాళికతో వెళ్తున్నాం. మా విజన్ ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా రానున్న రోజుల్లో పూర్తిగా 4లేన్ల రోడ్లు రాబోతున్నాయి. మంచి రోడ్లు ఉంటే గ్రామీణ తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమలు వస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి, భారత్ ఫ్యూచర్ సిటీ నుండి బెంగళూరు, చెన్నై గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బుల్లెట్ ట్రైన్ కారిడార్లు రాబోతున్నాయి. ఇది రాష్ట్ర అభివృద్ధిలో గేమ్ చేంజర్‌గా నిలవబోతున్నాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో నంబర్ వన్ చేయడమే మా లక్ష్యమని ప్రకటించారు. తెలంగాణలో ప్రతిపక్షం లేదు. తమ కుటుంబంలో ఒక్కొక్కరు పదివేల కోట్లు తిన్నారని కవిత ఆరోపిస్తోంది. కేసీఆర్ కేబినెట్ మంత్రులపై కవిత చేసిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఎర్రకోట పేలుళ్ల కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి




రోజులు పొడిగించింది. డాక్టర్ ముజమ్మిల్ గనై, డాక్టర్ అదీల్ రాథర్, డాక్టర్ షహీనా సయీద్ మరియు మౌల్వి ఇర్ఫాన్ అహ్మద్ వాగే అనే నలుగురిని వారి 10 రోజుల కస్టడీ ముగియడంతో ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జి అంజు బజాజ్ చంద్నా ముందు హాజరుపరిచారు. జమ్మూ కాశ్మీర్ పోలీసులు మొదట కనుగొన్న "వైట్ కాలర్" టెర్రర్ మాడ్యూల్‌గా దర్యాప్తు అధికారులు అభివర్ణిస్తున్న కేసులో ఇప్పటివరకు ఏడుగురిని ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఈ కేసులో పాల్గొన్న ఇతరులను గుర్తించడానికి అనేక ఆధారాలను అన్వేషిస్తున్నామని మరియు రాష్ట్రాల అంతటా సోదాలు నిర్వహిస్తున్నామని ఏజెన్సీ తెలిపింది. డాక్టర్ ఉమర్-ఉన్-నబి నడుపుతున్న పేలుడు పదార్థాలు నిండిన కారు ఎర్రకోట వెలుపల పేలి 15 మంది మృతి చెందగా, అనేక మంది గాయపడటంతో ఈ పేలుడు సంభవించింది

## గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చేదంతా దోచుకునేవాళ్లే

మొదటి పేజీ తరువాయి

షాకింగ్ కామెంట్లు చేశారు. గ్లోబల్ సమ్మిట్ కు వచ్చేది అంతా దోచుకునేవాళ్లేనని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికై రెండేళ్లు అయిందన్నారు. సీఎం కాకముందే, అయిన తరవాత రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారన్నారు. ఏడెనిమిది సార్లు రేవంత్ రెడ్డిని కలిసి అప్పులు ఎలా తీర్చాలి, రాష్ట్రం ఎలా అభివృద్ధి చేయాలి అనేదానిపై అనేక సలహాలు ఇచ్చానని చెప్పారు. కానీ ఆయన వినకపోగా వాటికి వ్యతిరేకంగా పనిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారన్నారు. కాబట్టి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఆరు గ్యారెంటీల్లో ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదన్నారు. తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదన్నారు. 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ చేస్తానని చెప్పి చేయలేదన్నారు. నిరుద్యోగులకు 4,500 ఇస్తామని ఇవ్వలేదన్నారు. అలా వందకు పైగా వాగ్దానాలు ఇచ్చి మోసం చేశారన్నారు. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ కూడా పడిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం దగ్గర డబ్బు లేదు, నన్ను కోసుకొని తిన్నండి అంటూ.. రెండు రోజులు సమ్మిట్‌కు 400 కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమ్మిట్‌కు 200 దేశాల్లో ఒక్క ప్రెసిడెంట్ అయినా వస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒక్క బిలియనీర్ అయిన వస్తున్నాడా? అని ప్రశ్నించారు.

# కొండాయిలో సర్పంచి ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క



ఏటూరునాగారం, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో సర్పంచి ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థి కురుసం సంధ్యారాణి&మహేష్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామస్థులను కోరారు. కొండాయి గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి అభివృద్ధి పనులు చేస్తున్నామని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని గ్రామ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని మంత్రి సీతక్క అన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బోచ్చు సత్యమ్మ ఇటీవలే అనారోగ్యంతో చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ మండల నాయకులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరికల జోరు



దామెర, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మద్దెబోయిన రాంబాబు, మార్క మహేందర్ ఆ పార్టీని వీడి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడీ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గండు రాము, నాయకులు నూకల వీరేశం,సర్పంచ్ అభ్యర్థి గండు దివాకర్,గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్ అభ్యర్థి



ఆత్మకూరు, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంథపెల్లి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మంథపెల్లి మిరియా తదితరులతో కలిసి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్‌కు స్వచ్ఛందంగా రాజీనామా చేశామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి జరుగాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ పల్లెల అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేశారని వెల్లడించారు.పార్టీలో చేరిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి మంథపెల్లి ప్రసాద్, మిరియా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంథపెల్లి సుధాకర్, యూత్ నాయకులు మంథపెల్లి వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



రేగొండ, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి, రేగొండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సెంటర్ల సందర్శించిన సందర్భంగా అదనపు కలెక్టర్ పిపిసీ ఇన్‌చార్జ్‌లకు కొనుగోలులో సూచనలు జారీ చేశారు. రైతులు తీసుకు వచ్చే ధాన్యంలో రోజువారి తేమ శాతాన్ని ఖచ్చితంగా పరిశీలిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి అని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ కాగానే టాబ్ ఎంట్రీలను 24 గంటల్లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ స్వయంగా మాయిచ్చర్ అప్డేట్ రిజిష్టర్, రోజు వారి కొనుగోలు రిజిష్టర్లను పరిశీలించి రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమయపాలన పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో డిసిఓ వాల్య నాయక్, ఎసి ఎస్వో వేణు, సివిల్ సప్లైస్ ఆర్ ఐ రాజు, రేగొండ ఆర్ఐ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలు మారాలంటే కాంగ్రెస్ ఒక్కటే మార్గం

## ప్రభుత్వం అండతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

## పలు గ్రామాల్లో మొదలైన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం

## ఎమ్మెల్యే నాగరాజు



వరంగల్ జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని అనంతారం, గోపనపల్లి, వడ్లకొండ, రోళ్ళకల్లు, నారాయణపురం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకై వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత గ్రామాల్లోని ప్రజలు డప్పు చప్పుళ్ళ, కోలాటాలు, డీజే లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామాల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా మనం చేసిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం కలిగిందన్నారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, మహిళలకు ఉచిత బస్సు, 500లకే గ్యాస్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రెండు లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలు చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. ఎర్ర సిబల్లి' దయాకర్ రావు నీకు సినిమాల మీద ఉన్న సోకు ప్రజల మీద లేకనే ఐదేళ్లు అభివృధి చేయలే మనవరాలి వయస్సు ఉన్న అమ్మాయి మీద ఓడిపోయి చిన్న మెదడు చితికి అన్ని పిచ్చి పిచ్చి మాటలు కూస్తున్నావు తస్మాత్ జాగ్రత్త ఎర్ర బల్లి' ప్రజలు బుద్ధి చెప్పిన కూడా సిగ్గు లేకుండా ఇంకా మా సీఎం రేవంత్ రెడ్డి గారి మీద పిచ్చి కూతలు చూస్తున్నావు మేము కాదు ప్రజలే నీ నాలుక చీరేస్తారు. మనవరాలి వయస్సు ఉన్న అమ్మాయి మీద ఓడిపోయి చిన్న మెదడు చితికి అన్ని పిచ్చి పిచ్చి మాటలు కూస్తున్నావు తస్మాత్ జాగ్రత్త ఎర్ర బల్లి' ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల అనంతారం గ్రామ సర్పంచ్ గొర్రె లక్ష్మి – దేవేందర్, గోపనపల్లి గ్రామ సర్పంచ్ నాంపల్లి విజయ – అశోక్, వడ్లకొండ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బిక్కు స్వర్ణలత– అనిల్ కుమార్, రోళ్ళకల్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూనావత్ దేవి – మాంగ్యా, నారాయణపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మూడు జంపా నాయక్ గార్ల గుర్తులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# అనంతారం చెరువులో ముగిసిన యువకుడి జీవితం

## మూడు రోజుల ఉత్కంఠకు తెరపడిన విషాదాంతం





మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాలోని అనంతారం చెరువులో మూడు రోజుల క్రితం గల్లంతైన పాలిటెక్నిక్ విద్యార్థి భూక్యా సాయికిరణ్ మృతదేహం చివరకు శుక్రవారం ఉదయం వెలికితీయబడింది. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు, స్థానిక పోలీసులు చేసిన నిరంతర శోధన చర్యలు చివరకు ఫలించగా, యువకుడి మరణం కుటుంబ సభ్యులు, గ్రామస్తులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. చెరువు అడుగున విస్తరించిన ఒంద్రుమట్టి, చెట్ల తీగలు శోధన చర్యలను క్లిష్టతరం చేశాయి. వీటి మధ్య చిక్కుకున్న సాయికిరణ్ మృతదేహం ఉపరితలానికి రాకపోవడంతో ఆపరేషన్ మరింత సవాలుగా మారింది.

**ఎస్పీ శబరీష్ స్వయంగా మానిటరింగ్**

ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ స్వయంగా ఘటనాస్థలానికి విచ్చేసి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ఆపరేషన్‌ను వేగవంతం చేయాలని సూచనలు చేస్తూ, అవసరమైన వనరులను తక్షణమే వినియోగించాలని ఆదేశించారు.

**మూడురోజుల ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన అధికారులు**

డిఎస్పీ తిరుపతిరావు, రూరల్ సిఐ సర్వయ్య ఆధ్వర్యంలో పోలీసులు మూడు రోజుల పాటు చెరువును జల్లెడ పట్టారు. పగలు–రాత్రి శోధన కొనసాగించిన పోలీసులు ఒక్క క్షణం కూడా వెనుతిరగకుండా ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. ఎన్‌డిఆర్ఎఫ్ డైవర్స్ నుండి గంటలపాటు నీటిమధ్య పోరాటం

ఎన్‌డిఆర్ఎఫ్ డైవర్స్ ఆక్సిజన్ సహాయంతో నీటి లోతుల్లో అనేక గంటలపాటు శోధించారు. తీవ్ర కృషి అనంతరం వారు చెరువు అడుగున చిక్కుకున్న సాయికిరణ్ మృతదేహాన్ని గుర్తించి జాగ్రత్తగా పైకి తెచ్చారు. ఆ క్షణం అక్కడ ఉన్న వారందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది.

**గ్రామాన్ని కప్పేసిన శోకం**

సాయికిరణ్ మరణవార్త స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పాలిటెక్నిక్ విద్యార్థిగా భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న యువకుడి జీవితం ఇలానే ముగిసిపోవడం కుటుంబ సభ్యులను మరింత కలచివేసింది.

# గులాబీ జెండా ఎగరడం ఖాయం : చల్లా ధర్మారెడ్డి

## బిఆర్ఎస్లో చేరిన సొసైటీ డైరెక్టర్, మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు



సంగెం, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి పెంతల సువర్ణకు మద్దతు తెలుపుతూ గ్రామం నుండి సుమారు 50 మంది మహిళలు మరియు సంగేమ్ సొసైటీ డైరెక్టర్ గోపతి రాజకుమార్, మాజీ ఉప సర్పంచ్ గోపతి సారంగంలతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీని వీడుతూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు వారికి పార్టీ కండువాకప్పి మాజీ ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ ఇదే ఉత్సాహంగా గ్రామంలో మహిళలకు నిత్యం అందుబాటులో ఉంటున్న మన అభ్యర్థి పెంతల సువర్ణని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అధికార దాహంతో పూటకో పార్టీ మారే వారికి సువర్ణ గెలుపు చెంప పెట్టులా మారాలని అన్నారు. అధికార బలంతో ప్రజలను భయ బ్రా%శీ%తులకు గురిచేస్తే సహించేదిలేదని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ ఎప్పుడు ప్రజల పక్షం ఉంటుందని అన్నారు. బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో సంగెం సొసైటీ డైరెక్టర్ గోపతి రాజకుమార్, కుంటపల్లి మాజీ ఉప సర్పంచ్ గోపతి సారంగం లతో పాటు బందెల ప్రసాద్, జక్క వెంకటేష్,జక్క కుమార్, నాణెబోయిన వికాస్, నేరెళ్ల స్వర్ణలత, గాదె అనిత, ఆమిరెడ్డి జ్యోతి,ఎనపోతుల రాధమ్మ, పడాలా సరస్వతి, దానం లక్ష్మి,సింగం భూతల్లి, ఎనపోతుల సునీత,కావటి శారద, గోవిందుల ప్రమీల తో పాటు 50 మందికిపైగా చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అధికంగా వచ్చే అవకాశం ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, సంబంధిత విభాగాల సిబ్బంది ఎలాంటి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పౌర సరఫరాలు, సహకార, డిఆర్డీఏ, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న సందర్భంగా రైతుల నుండి వరి కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వరి రాబడి గరిష్ట స్థాయికి చేరుతున్న ఈ సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ, ఆలస్యం జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రైతులు కేంద్రాలకు తెస్తున్న వరిలో తేమ శాతం ప్రతిరోజు పరిశీలించి రిజిష్టర్ లో నమోదులు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీలు, తూకాలు, రిజిష్టర్లు ఇతర సామగ్రి సిద్ధంగా ఉండాలని తెలిపారు. కొనుగోలు జరిగిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేస్తే 24 గంటల్లో రైతులకు డబ్బులు జమ చేయబడతాయని, ట్యాబ్ ఎంట్రీలో జాప్యం చేయొద్దని స్పష్టం చేశారు. పీక్ సీజన్ సమయంలో ప్రత్యేక నిఘా బృందాలు ఫీల్డ్‌లో నిరంతరం పర్యటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డీఓ బాలకృష్ణ, వ్యవసాయ అధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల మార్గదర్శకాలు తప్పక పాటించాలి

## జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్

## రెండవ విడత పోలింగ్ సన్నద్ధతపై అధికారులకు శిక్షణ



ములుగు జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 14 న సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు (పీఓలు, ఏపీఓలు) సోమవారం జెడ్ పి హెచ్ ఎస్ మల్లంపల్లి, జెడ్ పి హెచ్ ఎస్ ములుగు, జెడ్ పి హెచ్ ఎస్ లలో వేరు వేరుగా ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కేంద్రాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సందర్శించి, ఎన్నికల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు మరియు మార్గదర్శకాలను అధికారులు తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ యొక్క నియమ నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకుని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. మూడు విడతలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండవ విడత పోలింగ్ ఈ నెల 14న జరగనుంది. ఈ పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొని సదుపాయాలను పరిశీలించుకోవాలని, ఓటింగ్ కంపార్ట్ మెంట్, సిటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా సరిచూసుకోవాలని అన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన అన్నారు. అనంతరం ఎం పి డి ఓ వెంకటాపూర్ కార్యాలయం లో బ్యాలెట్ పేపర్ లను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎం పి డి ఓ లు, ఎంపి ఓ లు, ఆర్.ఓ.లు, ఏ ఆర్ ఓలు, పి.ఓ.లు., ఏపి ఓ లు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలి

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): పదవ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్ నగర్ నగరంలోని పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల, ఎదిర ఉన్నత పాఠశాల, ఏనుగొండ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు తన స్వంత నిధులతో ప్రత్యేకంగా రూపొందించిన %ు=% కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యూఆర్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ తో విద్యార్థులు ఎప్పుడైనా స్కాన్ చేసి చదువుకోగలిగేలా పాఠ్యాంశాలు, వీడియో పాఠాలు, ప్రాక్టీస్ బిట్స్ వంటి డిజిటల్ కంటెంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, సొంత రాష్ట్రంలో కూడా మహబూబ్ నగర్‌ను వెనక్కి నెట్టివేశారని, ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా ధ్వంసం చేశారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రిని ఒప్పించి ఉమ్మడి జిల్లా విద్యార్థుల కోసం మహబూబ్ నగర్‌కు ఐఐఐటి కళాశాలను తెచ్చామని, మన జిల్లాలో ఉన్న ఐఐఐటి కళాశాలలో మన ఉమ్మడి జిల్లా విద్యార్థులే అధిక శాతం ప్రవేశాలు పొందాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యా అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా ఆధునిక డిజిటల్ వనరులను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక విద్యా కార్యక్రమాలను చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషెద్ ఖాన్, మహ్మద్ మోసిన్, యాదమ్మ , నాయకులు సిహెచ్ మంజుల, వెంకటేష్ గౌడ్, కొత్త కిరణ్, రామస్వామి, మురళి గౌడ్, చంద్రకాంత్, గోపాల్, చర్ల శ్రీనివాసులు,గ్యాస్ అంజి, ఎరుకలి నర్సింహులు, ఎల్లయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సమక్షంలో జీ.పీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్




వరంగల్ జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది కేటాయింపులో మొదటి విడత 3వ ర్యాండమైజేషన్, రెండవ విడత 2వ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీమతి బాలమాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ల సమక్షంలో సోమవారం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నియమావళి ననుసరించి ఎన్నికల పి ఓ., ఓ.పీ.ఓ ల ర్యాండమైజేషన్ జరిగింది. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు బాలమాయాదేవి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సునయన చౌహాన్, నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని మొదటి విడతలో పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, రెండవ విడతలో గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, సంగెం

మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, పి.ఓ, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని మొదటి విడత లో గల 85 గ్రామ పంచాయతీలు 731 వార్డు స్థానాలకు, రెండవ విడతలో 114 గ్రామ పంచాయతీలు, 984 వార్డులకు గాను ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, పి.ఓ.,లను ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగింది. ఇందులో మొదటి విడతలో 1975 లో పి.ఓ.877,ఓ పి.ఓ లు 1098 పోలింగ్ సిబ్బందిని, రెండవ విడతలో 2568 లో పి ఓ.1181లు,ఓ పి ఓ లు గా 1387 పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డీపీఓ కల్పన, డీఈవో రంగయ్య నాయుడు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవ కార్యక్రమాన్ని చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): అంగరంగ వైభవంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న అధికారికంగా నిర్వహించే తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలు అమల్లో ఉన్న నేపథ్యంలో నిబంధనలు పాటిస్తూ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ ఈ రమేష్, డీఈ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక, ఉపకేంద్రం ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

## డాక్టర్ బి. రవి రాథోడ్



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సోమవారం గూడూరు మండలంలోని తీగలవేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బొల్లపల్లి, తీగలవేణి సబ్ సెంటర్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలను 12 వారాల్లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని మొదటి రెండు చెకప్లను %ూఎజ% వైద్యాధికారితో, తదుపరి మూడో, నాలుగో చెకప్లను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పరీక్షా చేఇంచుకోవాలని, అవసరమైతే స్కానింగ్, స్త్రీ వైద్య నిపుణురాలి సేవలు పొందేలా చూడాలని సూచించారు. గర్భిణీలను హాస్పిటల్‌కు తీసుకురావడానికి 102 వాహన సేవను వినియోగించుకోవాలని సూచించారు.సాధారణ ప్రసవాలను ప్రోత్సహించలని, సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ కోసం 30 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తిని స్క్రీనింగ్ చేయాలి, అవసరమైన మందులను అందించాలి అని కోరారు, సబ్ సెంటర్ రికార్డులను, అందులోని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు స్థితిని పరిశీలించారు.అన్ని జాతీయ కార్యక్రమాల్లోని డేటాను ఆన్‌లైన్ పోర్టల్‌లో సమయానికి అప్‌డేట్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలో వైద్యాధికారి డాక్టర్ రాంబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, షాను బేగం, రమేష్, ఫార్మసీ ఆఫీసర్ అమల, యు.డి.సి. ఉమామని , ఆరోగ్య కార్యకర్తలు కళావతి, శోభ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో గల్లంతైన మృతదేహాన్ని బయటకి తీసిన ఎస్డిఆర్ఎఫ్



మామునూర్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రత్యేక పోలీస్ మామునూర్ నాలుగో బెటాలియన్ కు చెందిన ఎస్డిఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ రవి నేతృత్వంలోని 25 మంది సభ్యుల బృందం అనంతారం గ్రామంలోని పోచమ్మ చెరువులో గల్లంతైన మృతదేహాన్ని ఈరోజు వెలికి తీశారు. శనివారం రోజున పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న భూక్య సాయి కిరణ్ తన స్నేహితులతో కలిసి మహబూబాబాద్ జిల్లాలోని అనంతారం గ్రామంలోని మైసమ్మ చెరువులో ఈత కొడుతూ చెరువులో గల్లంతయ్యాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే నాలుగో బెటాలియన్ ఎస్డిఆర్ఎఫ్ 25 మంది సభ్యుల బృందం వెంటనే ఘటన స్థలానికి బయలుదేరింది. శనివారం రాత్రి ఘటన స్థలానికి చేరిన ఎస్డిఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది.ఆది, సోమవారం రెండు రోజులపాటు శ్రమించిన ఎస్డిఆర్ఎఫ్ బృందం అధునాతన టెక్నిక్స్ అయినా అండర్ వాటర్ సెర్చ్, జీరో కట్ మెథడ్ లను ఉపయోగించి సోమవారం రోజున ముమ్మారంగా గాలింపు చర్యలు చేపట్టి మధ్యాహ్నాం మృతదేహన్ని కనుగొని బయటకి తీశారు.ఎస్డిఆర్ఎఫ్ బృందం పనితీరును చూసిన మహబూబాబాద్ జిల్లా ఎస్పి శబరిష్ మామునూర్ ఎస్డిఆర్ఎఫ్ బృందంను అభినందించారు. అలాగే నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, ఎస్డిఆర్ఎఫ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ రవి మరియు అధికారులు ఎస్డిఆర్ఎఫ్ బృందాన్ని అభినందించారు.

# పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): పంచాయతీ ఎన్నికల సంపూర్ణ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చండుగొండ మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్.ఓలు, ఏఈఓలతో సమావేశమై ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నియమ నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు నిర్వహిస్తున్న రికార్డులను విపులంగా పరిశీలించిన ఆయన, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది నుండి పోస్టల్ బ్యాలెట్ జారీ చేసే సమయంలో ఫారం%-%17, డ్యూటీ ఆర్డర్ కాపీని తప్పనిసరిగా పరిశీలించాలని, పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సంతకం స్పష్టంగా ఉండాలని, అదే లేకపోతే ఆ ఓటు చెల్లదని స్పష్టం చేశారు. అదేవిధంగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సిన వసతులు, పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన భోజన ఏర్పాట్లు, రూట్‌వారిగా మెటీరియల్ పంపిణీ, రవాణా ప్రణాళికలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచి ఎంపిక, తిరిగి బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ సెంటర్‌కు పంపిణీ చేసే దశల్లో అత్యంత జాగ్రత్తలు, భద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఈ పరిస్థితిలో కలెక్టర్ వెంట ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వ్యయాల పర్యవేక్షణలో భాగంగా పర్యటించిన ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ లావణ్య



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): గ్రాంపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యయాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడానికి నియమితులైన ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ లావణ్య సోమవారం పెంట్లం ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్.ఎస్.టీ., ఎఫ్.ఎస్.టీ. బృందాలు చురుకుగా పనిచేయాలని, అక్రమ రవాణా, నగదు పంపిణీ, విలువైన వస్తువుల తరలింపులను కట్టడి చేసి, ప్రతీ తనిఖీని తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే ఏ చర్యలనైనా తక్షణమే నివేదించాలని ఆమె స్పష్టం చేశారు. అనంతరం చంద్రుగొండ మండల కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని, పోటీ అభ్యర్థులు మరియు ఎన్నికల సంబంధిత బృందాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ మాట్లాడుతూ, ఎన్నికల వ్యయాల పట్ల పూర్తి పారదర్శకత పాటించాలని, ఖర్చుల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయాల పత్రాలను విధి విధానాలకు అనుగుణంగా నిర్వహించి, నిర్దిష్ట సమయానికి సమర్పించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా వ్యయ నోడల్ అధికారి, మండల ప్రత్యేక బృందాలు, పరిశీలన అధికారులు, పోటీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మద్దుకూరు గ్రామం లో రైతు తలారి రవి ఏర్పాటు చేసిన ఎలివేటెడ్ మేకలు/గొర్రెల పెంపక షెడ్‌ను పరిశీలించారు సోమవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలివేటెడ్ షెడ్ విధానం పశుసంవర్ధక రంగంలో ఆధునిక, శాస్త్రీయ పద్ధతి అని, ఈ విధానం ద్వారా జీవుల్లో అంటు వ్యాధులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల మరణాల శాతం ఈ విధానంతో స్పష్టంగా తగ్గడం శుభపరిణామమని అన్నారు. ఎలివేటెడ్ ఫ్లోరింగ్ కారణంగా పేడ, మూత్రం నేలపై నేరుగా పడిపోవడం వల్ల ఫ్లోర్ ఎప్పటికప్పుడు పొడి, పరిశుభ్రంగా ఉంటుంది. దీని వలన తడి లేకుండా శుభ్రమైన వాతావరణం ఏర్పడి, జీవుల్లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు తగ్గుతాయి అని తెలిపారు. పరిశుభ్రత పెరగడం వల్ల జీవాలు ఆరోగ్యంగా పెరిగి, పెరుగుదల శాతం కూడా గణనీయంగా మెరుగవుతుందని చెప్పారు. అలాగే రైతు తలారి రవి స్వయంగా రూపొందించిన గడ్డి కోసే యంత్రం, ఫర్నిచర్ యూనిట్, ఫీడ్ మిక్చర్ వంటి వినూత్న ఆవిష్కరణలను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. గ్రామీణ స్థాయిలో రైతులు ఇలాంటి సృజనాత్మకతను ప్రదర్శించడం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఎలివేటెడ్ షెడ్ నిర్మాణ వివరాలను కూడా కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. భూమికి 4-6 అడుగుల ఎత్తులో ఫ్లోర్‌ను ఎత్తుగా ఏర్పాటు చేసి, సుమారు 20%-%25 మేకలు/గొర్రెల కోసం 21 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తుతో షెడ్‌ను నిర్మించవచ్చని సూచించారు. సరైన గాలి ప్రసరణ, వెలుతురు మరియు పొడి వాతావరణం ఉండేలా ఈ షెడ్‌లను డిజైన్ చేయడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు, మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం వి సంతోష్, రెవెన్యూ అధికారి సంధ్యారాణి, రైతు తలారి రవి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# వంద శాతం ఓటింగ్ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఓటరు గుర్తింపు కార్డు (ఓటరు ఐడి) ఒక్కటే ప్రధానం కాదని ఎన్నికల సంఘం సూచించిన వివిధ రకాల 18 కార్డులను చూపించి కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించవచ్చు కోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జరిగిన మూడు విడత లల ఎన్నికల్లో 90.14 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని ఈసారి ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ కావాలన్నారు.

**18 రకాల గుర్తింపు కార్డుల వివరాలు**

1. UIDAI ఆధార్ కార్డు
– భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఇచ్చిన ఆధార్.
2. పీహెచ్ఈచ్ (PHC) ఫోటో
– ఫోటో ఐడెంటిటీగా ఉపయోగించవచ్చు.
3. డ్రైవింగ్ లైసెన్స్
4. రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు
– వీటిలో ఉద్యోగులకు జారీ చేసిన ఐడెంటిటీ కార్డులు.
5. బ్యాంకులు TSCAB/DCBs కోఆపరేటివ్ సంస్థలు
– ఉద్యోగులకు ఇచ్చే ఫోటో సహిత ఐడెంటిటీ కార్డులు.
6. ఆరోగ్య పథకం (హెల్త్ కార్డు)
– ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద జారీ చేసిన కార్డులు.
7. జాతీయ జనాభా నమోదు (RGI - NPR)
– భారత రెజిస్ట్రార్ జనరల్ చేసిన NPR క్రింద ఇచ్చే ఐడెంటిటీ పత్రాలు.
8. MNREGAలో పనిచేసే కార్మికులకు ఇచ్చే కార్డు.

9) కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసినటువంటి ఫోటోతో కూడిన ఆరోగ్య బీమా పథకం కార్డు (ESIC) (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

10) మాజీ సైనికోద్యోగుల పింఛను పుస్తకం/పింఛను చెల్లింపు ఉత్తర్వు, మాజీ సైనికోద్యోగుల వితంతు/వారిపై ఆధారపడినటువంటి వారి చెందిన ధృవపత్రాలు, వృద్ధుల పింఛను ఉత్తరువు, ఫోటోతో కూడిన వితంతు పింఛను ఉత్తరువులు వంటి ఫోటోతో కూడిన పింఛను పత్రాలు, (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

11) MLAలు/MLCలకు శాసన సభశాసన మండలి సచివాలయం జారీ చేసినటువంటి ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు.

12) ఫోటోతో కూడిన రేషను కార్డు (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

13) ప్రాధికారమివ్వబడినటువంటి అధికారిచే జారీచేసినటువంటి ఫోటోతో కూడిన ఎస్.సి.ఎస్.టి/బి.సి ధృవపత్రం. (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

14) ఫోటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు,

15) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్సు (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

16) ఫోటోతో కూడిన వికలాంగ ధృవపత్రం (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

17) పార్లమెంటు సభ్యులకు లోక్సభ/రాజ్యసభ సచివాలయం జారీచేసిన ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు.

18) ఫోటోతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి) వీటితో పాటు ఆన్లైన్ లో కూడా tsec. gov.in అనే వెబ్ సైట్ నుండి కూడా ఓటరు స్లిప్ ని డౌన్లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# ఎన్నికల ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలి

**హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి**

**విద్యార్థులకు ఇబ్బందులు కలగద్దు**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఎన్నికల నిర్వహణకి సంబంధించిన ప్రతీ ప్రక్రియ రాష్ట్ర ఎన్నికల సంఘ నియమ నిబంధన లకు అనుగుణంగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. దేవరోప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల లో సోమవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. దేవరోప్పుల, కొడకండ్ల, పాలకుర్తి ఎంపీడీఓ కార్యాలయలను సందర్శించి నామినేషన్ స్క్రూట్ ని ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంగం సూచించిన నియమ నిబంధనకు లోబడి స్క్రూట్ ని ప్రక్రియ జరగాలన్నారు. ఎన్నికల విధులను నిర్వర్తించే అధికారులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలని తెలుసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన హ్యాండ్ బుక్ ను అందరికి ఇవ్వాలన్నారు. స్ట్రాంగ్ రూమ్, సీసీ కెమెరా ల ఏర్పాటు గురించి పలు సూచనలను ఇచ్చారు. కొడకండ్ల మండలం లోని Sc బాలుర, బాలికల హాస్టల్ ని ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేసి పరిసరాలను, వంట గది ని, బాలుర విద్యార్థుల గదులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ చేపించాలని తాజా కూరగాయలను, నాణ్యమైన వంట సరుకులను మాత్రమే వాడాలని సూచించారు. చలికాలం సందర్భంగా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లు, తహసీల్దార్ లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు

# వ్యవసాయ శాఖ కార్యకలాపాలపై అధికారులతో సమీక్ష



వరంగల్ జిల్లా, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ కార్యకలాపాలపై అధికారులతో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ప్రస్తుత యాసంగి 2025-26 పంటకాలానికి సంబంధించి పంటల సరళి విత్తనాల లభ్యత మరియు ఎరువుల లభ్యత మరియు అమ్మకాలపై సమీక్షించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట 26,510 ఎకరాలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు 6,877 ఎకరాలలో మరియు వరి నారుమల్లు 11,500 ఎకరాలలో సాగులో ఉన్న యాసంగి పంటకాలానికి సంబంధించి అన్ని రకాల విత్తనాలు అందుబాటులో కలవని, యాసంగి పంటకాలంలో వరి 1,15,200 ఎకరాలలో సాగు అంచనా మరియు అందుకు అవసరమైన వరి విత్తనాలు 23,040 క్వింటాళ్ళు, మొక్కజొన్న 1,08,500 ఎకరాలలో సాగు అంచనా మరియు అందుకు అవసరమైన 8680 క్వింటాళ్ళ విత్తనాలు అందుబాటులో కలవని అన్నారు. యాసంగి పంట కాలానికి సంబంధించి అక్టోబర్ 2025 నుండి ఇప్పటివరకు 12,719 మెట్రిక్ టన్నుల యూరియా వరంగల్ జిల్లాకు సరఫరా చేయడం జరిగినదని, ఇందులో మార్కెఫెడ్ ద్వారా 4240 మెట్రిక్ టన్నుల, ప్రైవేటు డీలర్ల ద్వారా 4819 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయడం జరిగినది. ప్రస్తుతం మార్క్ఫెడ్ వద్ద 3660 మెట్రిక్ టన్నులు సొసైటీల వద్ద 498 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డివిజన్ల వద్ద 266 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలవని తెలిపారు. విత్తనాలు ,ఎరువుల విక్రయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. రైతులకు కావలసిన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని, కల్తీ విత్తనాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, యూరియా నిల్వలు ప్రతి మండలంలో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక బరువును తగ్గించుకోవాలంటే అన్నం తినడం పూర్తిగా మానేయాలా..?

అధిక బరువు సమస్య ప్రస్తుతం చాలా మందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. అధికంగా ఉన్న బరువు కారణంగా అనేక మంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. వేళకు భోజనం చేయకపోవడం, రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేయడం, ఆలస్యంగా నిద్రించడం, బయటి ఫుడ్ లేదా జంక్ ఫుడ్‌ను అధికంగా తినడం, మద్యం అధికంగా సేవించడం వంటి అనేక కారణాల వల్ల చాలా మంది అధికంగా బరువు పెరుగుతున్నారు. అయితే బరువు తగ్గేందుకు చాలా మంది అనేక రకాల డైట్‌లను పాటిస్తుంటారు. ఈ క్రమంలోనే అన్నం తినడం కూడా పూర్తిగా మానేస్తారు. లేదంటే బరువు తగ్గమేమోనని ఆందోళన చెందుతారు. అన్నంకు బదులుగా చపాతీలు, ఇతర ఆహారాలను తినేందుకు ప్రయత్నిస్తారు. అయితే అధిక బరువు తగ్గాలంటే కచ్చితంగా అన్నం తినడం మానేయాలా..? అన్నం తింటూ కూడా బరువును తగ్గించుకోలేమా..? అంటే ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.



**పిండి పదార్థాలు మనకు రోజూ అవసరమే.. కానీ..**

అధిక బరువును తగ్గించుకోవాలంటే డైట్ పాటించాలి. కానీ అన్నం తినడం పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అన్నం తింటూ కూడా బరువును తగ్గించుకోవచ్చు.. అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనే నెపంతో కొందరు అన్నం తినడం పూర్తిగా మానేస్తారు. కానీ అలా చేయాల్సిన పనిలేదని అంటున్నారు. అన్నాన్ని రోజూ కొద్ది కొద్దిగా తినవచ్చని సూచిస్తున్నారు. అన్నం అంటే పూర్తిగా పాలిష్ చేయబడిన బియ్యంతో వండేది. ఇందులో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. అవి మన శరీరంలో అధికంగా చేరితే కొవ్వు కింద మారుతాయి. దీంతో బరువు పెరుగుతారు. అయితే ఇలా జరిగే మాట వాస్తవమే. కానీ అంత మాత్రాన అన్నం తినడాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. రోజూ మనకు పిండి పదార్థాలు కూడా అవసరం అవుతాయి. కనుక మనకు కావల్సినంత మోతాదులో అన్నాన్ని కూడా తినాల్సి ఉంటుంది.

**ఒక కప్పు అన్నం తింటే..**

సాధారణంగా చాలా మందికి రోజూ 70 నుంచి 100 గ్రాముల మేర పిండి పదార్థాలు అవసరం అవుతుంటాయి. కనుక అన్నాన్ని పూర్తిగా మానేయాల్సిన పనిలేదు. అయితే ఈ పిండి పదార్థాలు లభించాలంటే అన్నాన్ని ఒక్కసారి ఒక కప్పు మోతాదులో మాత్రమే తినాలి. అంతకు మించి తినకూడదు. ఒక కప్పు అన్నం తింటే సుమారుగా 40 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి. కనుక పూటకు ఒక కప్పు అన్నం అయితే మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలూ కలిపి మొత్తం రెండు కప్పుల అన్నం తినవచ్చు. దీంతో 80 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి. ఇవి మనకు రోజుకు సరిపోతాయి. ఇలా అన్నాన్ని తినాల్సి ఉంటుంది. దీని వల్ల బరువు తగ్గడం కూడా తేలికవుతుంది.



**అన్నంకు బదులుగా..**

అయితే చాలా మంది అన్నాన్ని మరీ అతిగా తింటారు. అలాంటి వారికి ఎంత తింటున్నాం అనే విషయంపై నియంత్రణ ఉండదు. కనుక వారు ఎట్టి పరిస్థితిలోనూ ఒక కప్పు వరకు మాత్రమే అన్నాన్ని తినలేరు. కనుక అలాంటి వారు అన్నం తినడాన్ని పూర్తిగా మానేయడమే మంచిది. లేదంటే తక్కువ మోతాదులో తినడం వారికి సాధ్యం కాక అన్నాన్ని ఎక్కువగా తింటారు. దీంతో బరువు తగ్గాలనుకునే వారి ప్రణాళిక నెరవేరదు. అయితే మరి అన్నం తినకపోతే ఎలా.. అంటే అందుకు ప్రత్యామ్నాయంగా పుల్కాలను తినవచ్చు. ఒక పుల్కాను తింటే కేవలం 15 గ్రాముల పిండి పదార్థాలు మాత్రమే లభిస్తాయి. దీంతో పిండి పదార్థాలపై నియంత్రణ ఉంటుంది. లేదా బ్రౌన్ రైస్‌ను అయినా సరే ఆహారంలో భాగం చేసుకోవచ్చు. దీంతోనూ తక్కువ మోతాదులో పిండి పదార్థాలు, అధికంగా ఫైబర్ లభిస్తాయి. ఫైబర్ వల్ల బ్రౌన్ రైస్‌ను కాస్త తిన్నా సరిపోతుంది. పైగా బరువు తగ్గేందుకు ఇది సహాయం చేస్తుంది. ఇలా అన్నం తినడంపై అవగాహన ఉంటే బరువు తగ్గడం చాలా తేలికవుతుంది.

# గరం మసాలా పొడితో ఇన్ని లాభాలు ఉన్నాయా..?

## తరచూ తీసుకోవడం మరిచిపోకండి..!

వెజ్ అయినా నాన్ వెజ్ అయినా కొన్ని రకాల ప్రత్యేకమైన వంటకాలకు మసాలా అవసరం అవుతుంది. మసాలా వేయకపోతే ఆయా వంటకాలకు రుచి రాదు. వంటకాలకు రుచిని అందించడంలో మసాలాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ క్రమంలోనే వంటలను బట్టి కొందరు భిన్నమైన మసాలాలను ఉపయోగిస్తారు. అయితే అన్నింటిల్లోకెల్లా గరం మసాలాను అధిక శాతం మంది ఉపయోగిస్తుంటారు. ఇది కేవలం వెజ్ వంటకాలకు మాత్రమే కాకుండా నాన్ వెజ్ వంటకాలకు కూడా కామన్‌గా ఉపయోగపడుతుంది. అద్భుతమైన రుచి, సువాసనను అందిస్తుంది. గరం మసాలాను వంటల్లో వేస్తే అప్పుడు వచ్చే వాసనకే కడుపు నిండిపోయిన భావన కలుగుతుంది. అయితే వాస్తవానికి ఆయుర్వేద ప్రకారం గరం మసాలా పొడి మనకు ఎన్నో లాభాలను అందిస్తుంది. దీన్ని వంటల్లో వాడడం వల్ల అనేక లాభాలు ఉంటాయి.

**ఇందులో ఉండే మసాలా దినుసులు..**

గరం మసాలా పొడిలో అనేక మసాలా దినుసులు కలిసి ఉంటాయి. జీలకర్ర, ధనియాలు, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, నల్ల మిరియాలు, బిర్యానీ ఆకులు, జాపత్రి, జాజికాయ వంటి మసాలా దినుసులతో గరం మసాలా పొడిని తయారు చేస్తారు. ఇవన్నీ ఆయుర్వేద ప్రకారం ఎన్నో ఔషధ గుణాలను, పోషక విలువలను కలిగి ఉంటాయి. కనుక గరం మసాలా పొడి కూడా మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే మసాలా కనుక అప్పుడప్పుడు వాడాలి. తరచూ వాడితే జీర్ణ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. అయితే దీన్ని మోతాదులో అప్పుడప్పుడు వాడితే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. గరం మసాలా పొడిని మరీ అధికంగా వాడితే అసిడిటీ, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను కలగజేస్తుంది. కానీ దీన్ని తక్కువ మోతాదులో ఉపయోగిస్తే అదే జీర్ణ సమస్యలను తగ్గించే ఔషధంగా పనిచేస్తుంది. ఈ క్రమంలోనే గరం మసాలా పొడి వల్ల అనేక జీర్ణ సమస్యలను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, పొట్టలోని అసౌకర్యం తొలగిపోతాయి.



**శరీరం వెచ్చగా ఉండేందుకు..**

గరం మసాలా పొడిని వాడుతుంటే జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో మనం తినే ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఏర్పడకుండా చూసుకోవచ్చు. అలాగే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. గరం మసాలా పొడిలో అనేక రకాల మసాలా దినుసులు ఉంటాయి కనుక దీన్ని వాడితే అనేక యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీని వల్ల ఆక్సీకరణ ఒత్తిడి, వాపులు తగ్గుతాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. గరం మసాలా పొడి థర్మోజెనెసిస్ అనే ప్రక్రియను కలగజేస్తుంది. అంటే శరీరానికి వేడిని అందిస్తుందన్నమాట. ఈ క్రమంలో ఈ పొడిని చలికాలంలో ఎక్కువగా ఉపయోగిస్తుంటే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు. చలి నుంచి రక్షణ లభిస్తుంది.

**బరువు తగ్గేందుకు..**

గరం మసాలా పొడి వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఈ పొడి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. కనుక కీళ్లు, మోకాళ్ల నొప్పులను తగ్గిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారికి ఈ పొడి ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ఈ పొడిలో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. ఐరన్, మెగ్నిషియం, మాంగనీస్ వంటి మినరల్స్‌ను పొందవచ్చు. ఇలా గరంమసాలా పొడి మనకు అనేక లాభాలను అందిస్తుంది. కానీ దీన్ని మోతాదులోనే తీసుకోవాల్సి ఉంటుంది.

# శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్‌లో రాష్ట్రపతి బస

**బొల్లారం రాష్ట్రపతి నిలయంలో 5 రోజుల పాటు బస**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సాంప్రదాయంలో భాగంగా ప్రతి సంవత్సరంలో డిసెంబర్ నెలలో శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్ లో బస చేస్తారు. ఈ మేరకు ఈ సంవత్సరం కూడా ఆ షెడ్యూల్ ను కొనసాగిస్తున్నారు. ఇందుకు కంటోన్మెంట్ లోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని అధికారులు ఇప్పటికే సిద్ధం చేసి ఉంచారు. రాష్ట్రపతి భవన్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17న రాష్ట్రపతి ముర్ము హైదరాబాద్ చేరుకుంటారు. మొత్తం ఐదు రోజుల పాటు ప్రెసిడెంట్ హైదరాబాద్ లో ఉండనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ ఐదు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి పలు ముఖ్య కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇందులో భాగంగా, డిసెంబర్ 19న ఆమె రామోజీ ఫిల్మ్ సిటీ లో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆ తర్వాత, డిసెంబర్ 20న గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో గ్లోబల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరవుతారు. ఆమె పర్యటనలో చివరి రోజులకు సంబంధించిన వివరాలు కూడా ఖరారయ్యాయి. డిసెంబర్ 21న రాష్ట్రపతి వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశం అవుతారు. ఈ సమావేశం అనంతరం నిర్వహించే తేనీటి విందులో ఆమె పాల్గొంటారు. చివరగా, డిసెంబర్ 22న ఉదయం ఆమె హైదరాబాద్ నుంచి తిరిగి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.

# తెలంగాణ రైజింగ్.. స్టేట్ ఈజ్ సో షైనింగ్

**గ్లోబల్ సమ్మిట్‌లో ఆకట్టుకున్న థీమ్ సాంగ్**

**44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు**

**అట్టహాసంగా ప్రారంభమైన సదస్సు**




హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర అనుకూలతలను మరోసారి ప్రపంచ దేశాలకు చాటి చెప్పేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 లో 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. వివిధ అంశాలపై ఇక్కడ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రైజింగ్ థీమ్‌పై ప్రభుత్వం రూపొందించిన సరికొత్త పాటను ఆవిష్కరించారు. ఇవాళ గ్లోబల్ సమ్మింట్ వేదికగా ఈ పాటను ప్రదర్శించారు. 'తెలంగాణ రైజింగ్.. స్టేట్ ఈజ్ సో షైనింగ్.. ద ఫ్యూచర్ ఈజ్ బిల్డింగ్.. అంటూ సాగే ఈ పాటలో తెలంగాణ టూరిజం, పరిశ్రలు, భారత్ ఫ్యూచర్ సిటీ, గేట్ వే ఆఫ్ హైదరాబాద్, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అంశాలను పొందుపరిచారు. తెలంగాణలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని వచ్చి పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. ప్రతాప్ రానా రచించిన ఈ థీమ్ సాంగ్ ను రచించి దర్శకత్వం వహించారు.

# ఫ్యూచర్ సిటీకి అన్నపూర్ణ స్టూడియోస్



హైదరాబాద్, డిసెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఫీచర్ సిటీ లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ గ్లోబల్ సమ్మిట్ సోమవారం మధ్యాహ్నం ప్రారంభం అయింది. దీనికి ముఖ్య అతిథిగా టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చింది అని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్ చాలా అద్భుతంగా ఉందని నాగార్జున ప్రశంసించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'ఫ్యూచర్ సిటీ'కి తమ అన్నపూర్ణ స్టూడియోస్‌ను కూడా తీసుకురాబోతున్నట్లు నాగార్జున ప్రకటించారు. అలాగే, ఫ్యూచర్ సిటీ లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఒక ప్రత్యేకమైన 'ఫిలిం హబ్ ను ఏర్పాటు చేసే దిశగా ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రణాళికలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి కూడా చోటు కల్పించడం పట్ల హీరో నాగార్జున హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీ సినిమా షూటింగ్‌లకు, నిర్మాణాలకు ఒక ప్రధాన కేంద్రంగా మారుతుందని నాగార్జున ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐసీసీ, బీసీసీఐకి జియో హాట్‌స్టార్ షాక్

## స్ట్రీమింగ్ పార్ట్‌నర్ బాధ్యతల నుంచి నిష్క్రమణ

క్రికెట్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్. మరికొద్ది రోజుల్లో జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026కి ముందు ఇంటర్నేషనల్ క్రికెట్ మండలి (ఐసీసీ)తో పాటు భారతీయ క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కు షాక్ తగిలింది. ఇప్పటి వరకు టీమ్‌ఇండియా మ్యాచ్‌లకు స్ట్రీమింగ్ పార్ట్‌నర్‌గా ఉన్న జియోహాట్‌స్టార్.. ఇప్పుడు ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే T20 ప్రపంచ కప్ 2026కి ముందు జియోహాట్‌స్టార్ తన ఐసీసీ ఇండియా బ్రాడ్‌కాస్టింగ్ హక్కుల ఒప్పందం నుంచి ముందుగానే వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో టీ20 వరల్డ్ కప్ కోసం ఐసీసీ ఇప్పుడు కొత్త భాగస్వాములను వెతకాల్సి ఉంది. తాజా వెలువడిన ఓ మీడియా నివేదిక ప్రకారం.. టీమ్‌ఇండియా మ్యాచ్‌లకు బ్రాడ్‌కాస్టింగ్ పార్ట్‌నర్‌గా ఉన్న జియోహాట్‌స్టార్.. భారీ ఆర్థిక నష్టాల కారణంగా నాలుగేళ్ల హక్కు ఒప్పందాలను మరో రెండేళ్ల ఉండగానే పక్కకి తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయాన్ని జియో హాట్‌స్టార్ ఐసీసీకి తెలియజేసిందట. దీనికి ప్రత్యామ్నాయంగా కొన్ని బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీలను సంప్రదించినా వాటి నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. దీంతో 2026-29 ఏడాదికి భారతదేశ మీడియా హక్కుల కోసం ఐసీసీ కొత్త బిడ్డింగ్ సైకిల్‌ను ప్రారంభించిందని, దాదాపు 2.4 బిలియన్ డాలర్ల కోసం చూస్తుందని నివేదిక పేర్కొంది. ఈ హక్కుల కోసం సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియోలను ఓటీటీ వేదికలను స్ట్రీమింగ్ భాగస్వామిగా సంప్రదించినట్లు సమాచారం. కానీ, ఐసీసీ పెట్టిన భాగస్వామ్య ఖర్చు కారణంగా ఆయా ఓటీటీ సంస్థలు వెనుకాడుతున్నాయని తెలుస్తోంది. ఇదే నిజమైతే..ఇప్పుడీ వార్త ఐసీసీని ఇబ్బందుల్లోకి నెట్టినట్లే. ఎందుకంటే రాబోయే టీ20 ప్రపంచ కప్‌కు ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉంది. అయితే ఈ విషయంపై అత్యున్నత క్రికెట్ బోర్డు లేదా జియోస్టార్ అధికారికంగా ఏమీ ప్రకటించలేదు. కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న భారత్ , దక్షిణాఫ్రికా టీ20 సిరీస్‌ను బ్రాడ్‌కాస్టింగ్ చేసేందుకు జియో హాట్‌స్టార్ సిద్ధమవుతోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ముందుగా ఆడిన లీగ్ మ్యాచ్‌ల ఫలితాల ద్వారా ఒక్కో గ్రూప్ నుంచి మొదటి రెండు జట్లు తదుపరి రౌండ్‌కు చేరుకుంటాయి. ఆ రౌండ్ తర్వాత సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.



# జో రూట్ ఖాతాలో చెత్త రికార్డ్

క్రికెట్‌లో రికార్డులు రెండు రకాలుగా ఉంటాయి. కొన్ని గర్వంగా చెప్పుకునేవి అయితే, మరికొన్ని ఎప్పుడెప్పుడు చెరిగిపోతాయా అనిపించే చెత్త రికార్డులు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ ఇప్పుడు అలాంటి ఒక దారుణమైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో భాగంగా గబ్బా వేదికగా జరిగిన రెండో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు చిత్తుగా ఓడిపోయింది. ఈ ఓటమితో జో రూట్ ప్రపంచ క్రికెట్?లో ఒక చెత్త రికార్డును నెలకొల్పాడు. దీంతో భారత దిగ్గజం కపిల్ దేవ్ పేరిట ఉన్న ఈ చెత్త రికార్డును రూట్ అధిగమించాడు.గబ్బా టెస్ట్ జో రూట్?కు వ్యక్తిగతంగా చాలా స్పెషల్ అనే చెప్పాలి. ఎందుకంటే ఆస్ట్రేలియాలో అతనికి ఇదే టెస్టుల్లో తొలి సెంచరీ. ఈ డే/నైట్ టెస్టులో ఇంగ్లాండ్ తరఫున అద్భుతమైన పోరాట పటిమ కనబరిచిన రూట్ 138 పరుగులు చేశాడు. కానీ అతని సెంచరీ బూడిదలో పోసిన పన్నీరులా మారింది. స్టీవ్ స్మిత్ నాయకత్వంలోని ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఫలితంగా ఐదూ మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రూట్ శ్రమ వృథా అయ్యింది.ఈ ఓటమితో ఆస్ట్రేలియా గడ్డపై ఒక్క మ్యాచ్ కూడా నెగ్గకుండా అత్యధిక టెస్టులు ఆడిన ప్లేయర్‌గా రూట్ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఇప్పటివరకు జో రూట్ ఆస్ట్రేలియాలో 16 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. కానీ విచిత్రం ఏంటంటే ఇందులో ఒక్కటంటే ఒక్క మ్యాచ్‌లో కూడా ఇంగ్లాండ్ గెలవలేదు. దీంతో విదేశీ గడ్డపై ఒక్క గెలుపు లేకుండా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా రూట్ చెత్తరికార్డుల్లోకెక్కాడు. 148 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి.ఇంతకుముందు ఈ చెత్త రికార్డు భారత దిగ్గజం కపిల్ దేవ్ పేరిట ఉండేది. కపిల్ దేవ్ తన 16 ఏళ్ల కెరీర్‌లో పాకిస్థాన్ గడ్డపై 15 టెస్ట్ మ్యాచ్‌లు ఆడారు. కానీ దురదృష్టవశాత్తు అక్కడ ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా గెలవలేకపోయాడు. అందులో 10 డ్రాలు ఉండగా, 5 ఓటములు ఉన్నాయి. ఇన్నాళ్లకు జో రూట్ 16 మ్యాచ్‌లతో కపిల్ దేవ్ రికార్డును (15 మ్యాచ్ లు) దాటేశాడు.కాగా, రూట్ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఒక్క విజయం నమోదు చేయకుండా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్ న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ డేనియల్ వెటోరి. అతడు 12 మ్యాచ్‌లు ఆడినా ఒక్క టెస్టులోనూ నెగ్గలేదు. ఆ తర్వాత ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ (11 మ్యాచ్ లు), డేవిడ్ మలన్ (10) ఉన్నారు. జో రూట్ ఆడిన ఈ 16 మ్యాచ్‌ల్లో ఇంగ్లాండ్ ఏకంగా 14 సార్లు ఓడిపోవడం గమనార్హం. 2013 నుంచి ఇంగ్లాండ్ యాషెస్ కోసం ఆస్ట్రేలియా వెళ్లిన ప్రతిసారీ జో రూట్ జట్టులో ఉన్నాడు. కానీ ఫలితం మాత్రం మారడం లేదు. చివరిసారిగా ఇంగ్లాండ్ జట్టు ఆస్ట్రేలియాలో 2011 సిడ్నీ టెస్టులో గెలిచింది.

## నేటి నుంచే భారత్, దక్షిణాఫ్రికా

# టీ20 సిరీస్

**తొలి టీ20 మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి**

**శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా రీఎంట్రీ..**

**కుల్దీప్ యాదవ్‌పై వేటు పడే అవకాశం?**




దక్షిణాఫ్రికా టీమ్ ప్రస్తుతం భారత పర్యటనలో ఉంది. టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికా క్లీన్ స్లీప్ చేసుకోగా వన్డే సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. ఇక 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ మంగళవారం, డిసెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. ఇందునలో ఎవరు విన్ అవుతారోనని క్రికెట్ ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. కేవలం మూడు బంతులు మాత్రమే ఎదుర్కొన్న గిల్ కి మెడ పట్టేయడంతో.. అతడు మైదానాన్ని వీడాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. ఈ క్రమంలో రెండో టెస్టుతో పాటు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు దూరం అయ్యాడు. అయితే ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో టీ20 సిరీస్‌కు ఎంపిక అయ్యాడు. ఇప్పటి వరకు భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య 31 టీ20 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో భారత్ 18 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. 12 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. ఇక స్వదేశంలో భారత్ 5 మ్యాచ్‌ల్లో గెలవగా.. దక్షిణాఫ్రికా 4 మ్యాచ్‌ల్లో గెలిచింది. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ ముందు జరుగుతున్న ఈ సిరీస్ ఇరు జట్లకు కీలకంగా మారింది. టీ20ల్లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. అదే దూకుడు కనబర్చాలని భావిస్తుండగా.. డిఫెండింగ్ ఛాంపియన్‌కు దిమ్మతిరిగే షాకివ్వాలని సౌతాఫ్రికా పట్టుదలతో ఉంది. దాంతో ఈ తొలి టీ20 మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గాయాలతో భారత జట్టుకు దూరమైన టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రీఎంట్రీ ఇచ్చారు. కటక్ టీ20తో మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ ఇద్దరి రాకతో టీమిండియా బలం పెరగ్గా.. టీమ్ కాంబినేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.మెడ నొప్పితో సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌తో పాటు టీ20 సిరీస్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్.. అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. దేశవాళీ క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సూర్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఆడనుండగా.. హైదరాబాద్ స్టార్ తిలక్ వర్మ నాలుగో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. గత కొంత కాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్ యాదవ్‌కు ఈ సిరీస్ కీలకంగా మారనుంది. అతనిపై విమర్శలు తగ్గాలంటే బ్యాట్ ఝులిపించాల్సిందే. పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే ఆడనుండగా.. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ స్పిన్నర్లుగా ఆడనున్నారు. వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్‌కు అవకాశం దక్కనుంది. హిట్టర్ గురించి ఆలోచిస్తే జితేష్ శర్మ తుది జట్టులోకి వస్తాడు. స్పెషలిస్ట్ పేస్ బౌలర్‌గా బుమ్రా ఆడనున్నాడు. ఒకవేళ అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌పై వేటు పడుతుంది. సౌతాఫ్రికాతో మూడో వన్డేలో కుల్దీప్ యాదవ్ మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. కానీ టీమ్ కాంబినేషన్‌లో భాగంగా అతను బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి.

టీ20 సిరీస్‌లోని మ్యాచ్‌లు టీవీలో స్టార్ స్పోర్ట్స్ ఛానెల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. ఇక ఆన్‌లైన్, మొబైల్ ఫోన్‌లలో జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానున్నాయి. జియో సిమ్ వినియోగదారులు ప్రత్యేక రిచార్జ్ ప్లాన్స్ కలిగి ఉంటే.. వారికి జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా వస్తుంది. హాట్ స్టార్ సబ్‌స్క్రిప్షన్ ఉన్నవారు మ్యాచ్‌లను ఉచితంగా చూడొచ్చు.

**భారత్ తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ/సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్/అర్ష్‌దీప్ సింగ్

**భారత టీ20 టీమ్**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

**టీ20 సిరీస్ షెడ్యూల్ ఇదే..**

1. తొలి టీ20-డిసెంబర్ 9న (కటక్)
2. రెండవ టీ20-డిసెంబర్ 11న (ముల్లాన్‌పూర్)
3. మూడవ టీ20-డిసెంబర్ 14న (ధర్మశాల)
4. నాలుగవ టీ20-డిసెంబర్ 17న (లక్నో)
5. ఐదవ టీ20-డిసెంబర్ 19న (అహ్మదాబాద్)

# నెట్స్‌లో స్మృతి మంధాన బ్యాటింగ్ ప్రాక్టీస్

టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన తన వ్యక్తిగత జీవితంలో జరిగిన ఒక ఊహించని పరిణామాన్ని పక్కనపెట్టి, దేశం కోసం తిరిగి మైదానంలోకి దిగారు. సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో జరగాల్సిన తన వివాహం రద్దయినట్లు ప్రకటించిన మరుసటి రోజే ఆమె క్రికెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్‌ల వివాహం నవంబర్ 23న జరగాల్సి ఉండగా, స్మృతి తండ్రి అనారోగ్యం కారణంగా వాయిదా పడింది. అయితే, తాజాగా ఈ పెళ్లి పూర్తిగా రద్దయినట్లు స్మృతి సోషల్ మీడియా ద్వారా ధృవీకరించిన సంగతి తెలిసిందే. "నా పెళ్లి ఆగిపోయింది. ఈ విషయాన్ని ఇక్కడితో ముగించాలనుకుంటున్నాను. దయచేసి మా కుటుంబాల ప్రైవసీని గౌరవించండి" అని ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో కోరారు. ఈ వ్యక్తిగత బాధ నుంచి తేరుకోవడానికి సమయం తీసుకోకుండా, స్మృతి వెంటనే తన కర్తవ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. డిసెంబర్ 21 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం ఆమె నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించింది."నన్ను నడిపించేది దేశమే. అత్యున్నత స్థాయిలో నా దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నాకు ముఖ్యం. సాధ్యమైనంత కాలం భారత్ తరఫున ఆడి ట్రోఫీలు గెలవడమే నా లక్ష్యం," అని స్మృతి తన అంకితభావాన్ని చాటుకుంది.వ్యక్తిగత జీవితంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఆటపై ఆమెకున్న నిబద్ధతను చూసి అభిమానులు, క్రికెట్ వర్గాలు ఆమెను ప్రశంసిస్తున్నాయి.



# శాంసన్ కంటే శుభ్‌మన్ గిల్ సరైనవాడు

**భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**




సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. మంగళవారం కటక్ వేదికగా జరిగే తొలి టీ20 మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్ కోసం టీమిండియా అన్ని విధాల సన్నద్ధమైంది. గాయంతో జట్టుకు దూరమైన టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రీఎంట్రీ ఇచ్చారు.ఈ మ్యాచ్ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పాల్గొన్నాడు. జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రయోగాలు కొనసాగుతాయని స్పష్టం చేశాడు. ఓపెనింగ్ స్థానానికి సంజూ శాంసన్ కంటే శుభ్‌మన్ గిల్ సరైనవాడని అభిప్రాయపడ్డాడు. జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనింగ్ జోడీ తప్పా.. ఏ స్థానాలు ఆటగాళ్లకు స్థిరంగా ఉండవని తెలిపాడు.'ఈ సిరీస్‌లోనూ బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రయోగాలు జరుగుతాయి. మూడో స్థానం నుంచి ఆరో బ్యాటర్ వరకు ఆటగాళ్లు మారుతూనే ఉంటారు. ఓపెనర్లు తప్పా మరే ఆటగాడికి స్థిరమైన బ్యాటింగ్ పొజిషన్ ఉండదు. మా జట్టులో ఏ స్థానంలోనైనా రాణించగలిగే ప్రతిభావంతులు ఉన్నారు. జట్టు నిండా ప్రతిభావంతమైన ఆటగాళ్లు ఉండటంతో తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది. తొలి టీ20లో తిలక్ వర్మ ఆరో స్థానంలో ఆడవచ్చు. శివమ్ దూబే మూడో స్థానంలో బరిలోకి దిగవచ్చు. మా జట్టు విధానం ఇదే.ప్రస్తుతం మా టీమ్ చాలా బలంగా ఉంది. సంజూ శాంసన్ విషయానికొస్తే.. అతను ఓపెనర్‌గా పరుగులు చేశాడు. కానీ అతని కంటే ముందు గిల్ ఓపెనర్‌గా ఆడాడు. కాబట్టి ఓపెనర్‌గా శుభ్‌మన్ గిల్ ప్రాధాన్యత ఇస్తాం. అందుకు గిల్ పూర్తి అర్హుడు. సంజూ శాంసన్‌కు మేం చాలా అవకాశాలు ఇచ్చాం. అతను ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్దంగా ఉన్నాడు. సంజూ వంటి ఆటగాళ్ల వల్ల కెప్టెన్‌గా నా పని మరింత సులువు అవుతుంది. ఓపెనింగ్ చేయడంతో పాటు మిడిలార్డర్‌లో ఆడగలిగే సామర్థ్యం ఉన్న ఆటగాళ్లు జట్టులో ఉండటం మా జట్టు బలం.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ ముందు జరుగుతున్న ఈ సిరీస్ ఇరు జట్లకు కీలకంగా మారింది. టీ20ల్లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. అదే దూకుడు కనబర్చాలని భావిస్తుండగా.. డిఫెండింగ్ ఛాంపియన్‌కు దిమ్మతిరిగే షాకివ్వాలని సౌతాఫ్రికా పట్టుదలతో ఉంది. దాంతో ఈ తొలి టీ20 మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# 20 నిముషాల పాటు వెంకీ సందడి

## దర్శకుడు అనిల్ రావిపూడి


టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చిత్రం మన శంకర వర ప్రసాద్ గారు. 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. వెంకటేశ్ కామియో రోల్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీలో వెంకీ, చిరు పాటకు సంబంధించిన వార్తతో సినిమాపై అంచనాలు పెరిగి పోతున్నాయి. ఈ చిత్రంలో వెంకటేశ్ ఎంతసేపు కనిపించబోతున్నాడనే దానిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాన్ని షేర్ చేశాడు అనిల్ రావిపూడి. వెంకటేశ్ ఇందులో సుమారు 20 నిమిషాలు కనిపిస్తాడని చెప్పాడు. అంతేకాదు క్లైమాక్స్‌లో చిరంజీవి, వెంకటేశ్ మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతాయని క్లారిటీ ఇచ్చేశాడు. ఈ కామెంట్స్‌తో మూవీ లవర్స్‌కు ఫుల్ మీల్స్ వినోదాన్ని గ్యారంటీ అని చెప్పకనే చెబుతున్నాడు అనిల్ రావిపూడి. ఇప్పటికే మన శంకర వర ప్రసాద్ గారు నుంచి రిలీజ్ చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతుండగా.. శశిరేఖ సాంగ్ కూడా మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. ఈ చిత్రంలో వీటీవీ గణెళిశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్ధన్, రేవంత్ భీమల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వెంకటేశ్ ఎక్స్‌టెండెడ్ క్యామియో పాత్ర మరింత హైలైట్ కానుందని తాజాగా దర్శకుడు అనిల్ రావిపూడి వెల్లడించారు. ఓ తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన అనిల్ రావిపూడి, వెంకటేష్ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందని, కేవలం గెస్ట్ అప్పియరెన్స్ మాత్రమే కాకుండా 20 నిమిషాలపాటు ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ చేస్తాడని స్పష్టంచేశారు. ఇటీవల వెంకటేష్ ఒక పాట షూట్ కూడా పూర్తి చేశారు. వెంకీ ఎంట్రీతో సినిమా హాస్యభరిత వాతావరణం మరింత పెరిగేలా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు స్టార్లు కలిసి కనిపించడం చాలా అరుదుగా జరిగే విషయం కావడంతో, ఈ కాంబినేషన్ స్క్రీన్‌పై సూపర్ ఎనర్జీ క్రియేట్ చేయనుంది. చాలా రోజుల తర్వాత మళ్లీ పూర్తిస్థాయి కామెడీ సినిమాతో వస్తున్నందుకు చిరంజీవి కూడా ఉత్సాహంగా కనిపిస్తున్నారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల, సాహు గారపాటి సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.




# అఖండ 2కు తొలగిన అడ్డంకులు

## 12న విడుదలకు మార్గం సుగమం: తమ్మారెడ్డి వ్యాఖ్య

బాలకృష్ణ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తోన్న చిత్రం 'అఖండ 2' ఆర్థిక వ్యవహారల కారణంగా వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. తాజాగా ఈ సినిమా ఇష్యూ క్లియర్ అయిందని టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. డిసెంబర్ 12న 'అఖండ 2' విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరంలో 'హరిహరవీరమల్లు', 'అఖండ 2' విడుదల విషయంలో ఇబ్బందులు వచ్చాయి. నిర్మాతలకు గతంలో ఉన్న ఆర్థికపరమైన కమిట్‌మెంట్‌ల కారణంగా ఇవి తలెత్తాయి. 'హరిహర వీరమల్లు' ఇష్యూ క్లియర్ కాగానే విడుదలైంది. ఇప్పుడు 'అఖండ 2' ఇష్యూ కూడా క్లియర్ అయింది. నా అంచనా ప్రకారం డిసెంబర్ 12న విడుదలయ్యే అవకాశం ఉంది. అందరూ దీనికోసం ఎదురుచూస్తున్నారు కాబట్టి సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తారు' అని అన్నారు. 'సినిమా విడుదల ఆలస్యమైనంత మాత్రాన దాని ఫలితంపై ప్రభావం పడదు. దానికి వచ్చే ఓపెనింగ్స్ అలానే ఉంటాయి. కాకపోతే ముందు చెప్పిన తేదీకే విడుదలైతే ఆ రోజు కోసం అందరూ సిద్ధంగా ఉంటారు కాబట్టి రెవెన్యూ విషయంలో కొంచెం వ్యత్యాసం ఉంటుందంతే. రూ.3 నుంచి రూ.4 కోట్లు తేడా రావొచ్చంతే. పెద్ద సినిమాలు బాగున్నా, బాలేకపోయినా వాటికి వచ్చే రెవెన్యూ మొదటి మూడు రోజుల్లోనే వచ్చేస్తుందని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. డిసెంబర్ 12న ఈ సినిమా విడుదల కానున్నట్లు వార్తలు జోరందుకోవడంతో.. పలు ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఓవర్సీస్‌లోనూ 'అఖండ 2' విడుదల కానున్న విషయం తెలిసిందే. తాజాగా ఆస్ట్రేలియాలో ఈ సినిమా బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. దీంతో మేకర్స్ ఈ తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు అభిమానులు భావిస్తున్నారు.



# భర్త మహాశయులకు విజ్ఞప్తి నుంచిమరో పాట

టాలీవుడ్ యాక్టర్ రవితేజ ప్రస్తుతం కిశోర్ తిరుమల దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే నయా టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, ఖిలాడి ఫేం డింపుల్ హయతి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ సాంగ్ విడుదల చేయగా మ్యూజిక్ లవర్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా సెకండ్ సింగిల్ అద్దం ముందు అప్‌డేట్ అందించారు. రవితేజ, డింపుల్ హయతి కాంబోలో రానున్న ఈ సాంగ్ ప్రోమోను డిసెంబర్ 10న సాయంత్రం 6:03 గంటలకు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. రవితేజ, డింపుల్ హయతి సూపర్ కూల్ ట్రాక్‌తో సాంగ్ విజువల్స్ ఉండబోతున్నట్టు తాజా లుక్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుండగా.. విడుదల తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ పక్కా ఫ్యామిలీ టచ్‌తో రవితేజ సినిమా ఉండబోతున్నట్టు గ్లింప్స్ హింట్ ఇచ్చేస్తుంది. టైటిల్ గ్లింప్స్‌లో భక్త మహాశయులకు విజ్ఞప్తి.. ఇవాళ 10 : 30 నిమిషాలకు స్వామి వారి కళ్యాణం. అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందంటూ.. పంతులు వాయిస్ ఓవర్‌తో సాగే మాటలతో షురూ అయింది గ్లింప్స్. అనంతరం ఈ అనౌన్స్‌మెంట్ మనలో చాలా మంది చాలా సార్లు వినుంటాం. ఇప్పుడు నాకిది ఎందుకు గుర్తొచ్చిందంటే నా జీవితంలో ఉన్న ఇద్దరు ఆడవాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ, జెమినీ, చాట్ జీపీటీ ఇలా అన్నింటిని అడిగాను. వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా అయోమయానికి గురిచేశాయి అంటూ రవితేజ వాయస్ ఓవర్‌తో సాగుతున్న వీడియో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

# కిడ్నాప్ అత్యాచరం కేసులో తీర్పు

## మళయాల నటుడు దిలీప్‌ను నిర్దోషిగా తేల్చిన కోర్టు

కేరళలో సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల కేసులో కేరళ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఓ నటి అపహరణ, అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ మలయాళ నటుడు దిలీప్‌ను నిర్దోషిగా తేల్చింది. ఈ మేరకు ఎర్నాకులం కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. 2017లో మలయాళ నటి కిడ్నాప్ కేసు సంచలనం రేపింది. కారులో ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నటుడు దిలీప్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు నటుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు దిలీప్‌ను అరెస్ట్ కూడా చేశారు. అయితే బెయిల్‌పై అతడు రిలీజ్ అయ్యారు. ఇక ఎనిమిదేళ్లపాటూ సాగిన ఈ కేసులో కోర్టు నేడు సంచలన తీర్పు వెలువరించింది. ఆరోపణలపై తగిన ఆధారాలు చూపించలేకపోయిన కారణం చేత ఎర్నాకులం సెషన్స్ కోర్టు దిలీప్‌ను నిర్దోషిగా తేల్చింది. ఈ మేరకు సోమవారం ఉదయం తీర్పు వెలువరించింది. దిలీప్ సహా ముగ్గురిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఇక అత్యాచారం, కుట్ర కేసులో మరో ఆరుగురిని దోషులుగా తేల్చింది.

# కుదిరితే రుక్మిణి.. లేదంటే భాగ్య శ్రీ..!

టాలీవుడ్ లో కొత్త భామల సందడి కనిపిస్తుంది. మొన్నటిదాకా స్టార్స్ గా ఉన్న హీరోయిన్స్ కాస్త వెనక్కి తగ్గగా అందరి చూపు ఈ కొత్త హీరోయిన్స్ వైపు మళ్లింది. అందులో ముఖ్యంగా ఒక ఇద్దరి హీరోయిన్స్ గురించి సోషల్ మీడియాలో రెగ్యులర్ డిస్కషన్ జరుగుతుంది. ఇంతకీ ఎవరా ఇద్దరు అంటే ఒకరు భాగ్య శ్రీ బోర్స్ కాగా.. మరొకరు రుక్మిణి వసంత్. ఈ అందాల భామల ఇద్దరు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నారు. కాంతారా చాప్టర్ 1 తో రుక్మిణి సౌత్ లో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అది చాలదు అన్నట్టుగా అమ్మడు ఎన్ టీ ఆర్ నెక్ట్స్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. తారక్ తో సినిమా అంటే టాలీవుడ్ లో స్టార్ రేంజ్ దక్కినట్టే లెక్క. రుక్మిణికి తెలుగు యూత్ లో ఉన్న ఫాలోయింగ్ చూసి దర్శక నిర్మాతలంతా ఆమె కోసం క్యూ కడుతున్నట్టు తెలుస్తుంది. రుక్మిణి కూడా టాలీవుడ్ లో తన సత్తా చాటేందుకు రెడీ అవుతుంది. ఇక భాగ్య శ్రీ బోర్స్ కూడా తెలుగు యువత మనసులు గెలిచింది. రీసెంట్ గా రాం తో ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాతో మెప్పించింది అమ్మడు. కెరీర్ లో ఒక్క సాలిడ్ హిట్ పడితే మాత్రం భాగ్య శ్రీకి తిరుగు ఉండదు. అందుకే నెక్ట్స్ పాన్ ఇండియా సినిమాలనే టార్గెట్ చేసుకుందని తెలుస్తుంది. భాగ్య శ్రీ ఖాతాలో ఒక భారీ హిట్ పడితే మాత్రం సౌత్ లో ఆమె టాప్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ ఉందని చెప్పొచు. రుక్మిణి వసంత్, భాగ్య శ్రీ బోర్స్ ఎవరి బలాలు వారివి. కాకపోతే రుక్మిణి గ్లామర్ కన్నా తన నటనతో ఎక్కువ ఇంపాక్ట్ చూపిస్తుంది. ఐతే భాగ్య శ్రీ నుంచి ఆడియన్స్ గ్లామర్ షో కూడా ఆశిస్తున్నారు. అమ్మడు కూడా అందుకు రెడీ అన్నట్టుగానే ఉంది. తొలి సినిమా మిస్టర్ బచ్చన్ లోనే భాగ్య శ్రీ గ్లామర్ ఎటాక్ ఆడియన్స్ ని ఫిదా చేసింది.సో ఈ ఇద్దరు హీరోయిన్స్ కూడా తెలుగులో వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను ఇంప్రెస్ చేయాలని కోరుతున్నారు. భాగ్య శ్రీ నెక్ట్స్ అఖిల్ తో లెనిన్ సినిమా చేస్తుంది. రుక్మిణి వసంత్ ఎన్టీఆర్ తో డ్రాగన్ చేస్తుండగా ఆ నెక్ట్స్ కూడా స్టార్ సినిమాలు డిస్కషన్ జరుగుతున్నట్టు తెలుస్తుంది. రుక్మిణి ఆల్రెడీ స్టార్స్ తో నటిస్తుంది కాబట్టి భాగ్య శ్రీతో పోలిస్తే కాస్త అడ్వాన్స్ గా ఉంది. ఐతే భాగ్య శ్రీ గ్లామర్ షో మాత్రం ఆడియన్స్ ని తెగ డిస్టర్బ్ చేస్తుంది. అమ్మడి ఖాతలో ఒక్క సూపర్ హిట్ పడినా భాగ్య శ్రీ రేంజ్ మారిపోతుందని చెప్పొచ్చు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463